క్లుప్తంగా

నేడు మంత్రి రాజా పర్యటన

కోటనందూరు: మండలంలోని బొద్దవరంలో సోమవారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా పర్యటిస్తారని ఎంపీపీ లగుడు శ్రీనివాసు ఆదివారం తెలిపారు. ఉదయం 11.30 గంటలకు బొద్దవరంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తారన్నారు. అనంతరం అదే గ్రామంలో జరిగే జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు కిర్లంపూడిలో గడపగడపకూ మన ప్రభుత్వం

కిర్లంపూడి: మండల కేంద్రమైన కిర్లంపూడిలో సోమవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీపీ తోట రవి ఆదివారం తెలిపారు. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజలందరికీ రక్షిత తాగునీరు



జి.కొత్తపల్లిలో పైప్‌లైన్ వేస్తున్న దృశ్యం

శంఖవరం: గ్రామాల్లోని ప్రజలందరికీ రక్షిత తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని జి.కొత్తపల్లి సర్పంచ్ ఈగల విజయదుర్గ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో ఆదివారం జలజీవన్ మిషన్ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఈగల విజయదుర్గ మాట్లాడుతూ జలజీవన్ మిషన్‌లో భాగంగా ప్రతిఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి తాగునీరు అందిస్తామన్నారు. దీంతో గ్రామంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. పైప్‌లైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

మేధావులతో బీజేపీ గృహసంపర్కం



ఏలేశ్వరంలో మేధావులను కలిసిన బీజేపీ నాయకులు

ఏలేశ్వరం: కేంద్రంలో తొమ్మిదేళ్ల పాలనపై పార్టీ పిలుపు మేరకు చేపట్టిన మేధావులతో బీజేపీ గృహసంపర్కం కార్యక్రమానికి విశేష స్పందన వస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలో ఆదివారం బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడు గట్టెం వెంకటరమణ ఆధ్వర్యంలో మేధావులను పార్టీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గృహసంపర్కం కార్యక్రమం ద్వారా మేధావులను కలిసి నియోజకవర్గవ్యాప్తంగా 150 మంది అభిప్రాయాలను కేంద్రప్రభుత్వానికి పంపిస్తామన్నారు. దీనిలో భాగంగా వైద్యులు, న్యాయవాదులు, తటస్థ ప్రజల అభిప్రాయాలు తీసుకున్నామన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పాలనపై మేధావుల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కర్రి ధర్మరాజు, కురాకుల రాజా, బండారు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పాతకొట్టాంలో 'మీ ఇంటికి- మీ దివ్య'

కోటనందూరు: మండలంలోని పాతకొట్టాంలో ఆదివారం టీడీపీ నాయకుడు షేక్ నవాబ్‌జానీ ఆధ్వర్యంలో మీ ఇంటికి–మీ దివ్య కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ తుని నియోజకవర్గ ఇన్‌చార్జ్ యనమల దివ్య, పార్టీ నాయకులు ఇంటింటా పర్యటించారు. ఇటీవల టీడీపీ విడుదల చేసిన మినీ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని దివ్య విజ్ఞప్తి చేశారు. టీడీపీ నాయకులు యనమల కృష్ణుడు, గాడి రాజబాబు, అంకంరెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సారాతో వ్యక్తి అరెస్ట్

గండేపల్లి: సారా తయారు చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు స్థానిక ఎస్సై వై. గణేష్ కుమార్ తెలిపారు. మండలంలోని మురారి శివారులో అక్రమంగా సారా తయారు చేస్తున్న ఆదే గ్రామానికి చెందిన కలిపే మోసేను అరెస్ట్ చేసి అతని నుంచి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి సిద్ధం చేసిన సుమారు 200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి పెద్దాపురం కోర్టుకు తరలించినట్టు ఎస్సై తెలిపారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్ట్

గండేపల్లి: మండలంలోని యర్రంపాలెంలో పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. వివరాల్లోకి వెళితే... యర్రంపాలెం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే ముందస్తు సమాచారం మేరకు స్థానిక ఎస్సై వై.గణేష్ కుమార్ తన సిబ్బందితో దాడి చేశారు. పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.22500 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ఇక ఇంటికే పౌష్టికాహారం

- గర్భిణులు, బాలింతలకు పంపిణీ
- అంగన్‌వాడీల ద్వారా అందజేసేందుకు చర్యలు
- నెలలో రెండు విడతలుగా పంపిణీ
- ఈ నెల 15 నుంచి అమలు కానున్న టేక్ హోం రేషన్



ప్రత్తిపాడులో గర్భిణులు, బాలింతలకు ఇంటికే పౌష్టికాహారం పంపిణీపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ లక్ష్మి

ప్రత్తిపాడు: మాతా శిశు సంరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తోంది. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తోంది. మాతా శిశు సంరక్షణ, స్త్రీలలో రక్తహీనత నివారణకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు రుచికరమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని వండి వడ్డిస్తున్నారు. కొంతమందికి అంగన్‌వాడీ కేంద్రాలు కాస్త దూరంగా ఉండడం, ఆరోగ్య సమస్యల మూలంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లక పోవడంతో వారికి సంపూర్ణ ఆహారం అందడం లేదు. ఈ విషయాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంది. ఈ నెల 15వ తేదీ నుంచి గర్భిణులు, బాలింతలకు వారి ఇళ్లకే పౌష్టికాహారం అందించాలని నిర్ణయించింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో వండిన ఆహారం కాకుండా 'టేక్ హోం రేషన్' పేరుతో ఇంటికే పౌష్టికాహార సరకులు అందజేసేందుకు చర్యలు తీసుకుంది. దీంతో గర్భిణులు, బాలింతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టులో 2,039 మందికి సరకులు

నూతనంగా ఏర్పాటు చేసిన ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ప్రత్తిపాడు మండలంలో 79 అంగన్‌వాడీ కేంద్రాలు, మూడు మినీ కేంద్రాలు, ఏలేశ్వరం మండలంలో 58 అంగన్‌వాడీ కేంద్రాలు, ఒక మినీ కేంద్రం ఉన్నాయి. ఈ కేంద్రాల్లో 1,049 మంది గర్భిణులు, 970 మంది బాలింతలు నమోదయ్యారు. వీరందరికీ ఈ నెల 15 నుంచి ఇంటికే అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది పౌష్టికాహారాన్ని పంపిణీ చేయనున్నారు.

ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో లబ్ధిదారుల వివరాలు

మండలం	గర్భిణులు	బాలింతలు
ప్రత్తిపాడు	527	496
ఏలేశ్వరం	522	474
మొత్తం	1,049	970

సంపూర్ణ పోషణ కిట్లలో సరకులు

పౌష్టికాహారం	అందించే పరిమాణం
రాగి పిండి	కేజీ
కందిపప్పు	కేజీ
బియ్యం	3 కేజీలు
బెల్లం	500 గ్రాములు
చిక్కీలు	500 గ్రాములు
ఎండు ఖర్జూరం	500 గ్రాములు
మంచి నూనె	500 గ్రాములు
గుడ్లు	25
పాలు	5 లీటర్లు

సంపూర్ణ పోషణ పథకంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 6 నెలల నుంచి 3 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు నెలకు బాలామృతం ప్యాకెట్, 30 గుడ్లు, 6 లీటర్ల పాలు అందిస్తున్నారు.

శుభపరిణామం



గర్భిణులు, బాలింతల ఇంటికే పౌష్టికారాన్ని అందించాలని ప్రభుత్వం నిర్ణయించడం శుభపరిణామం. ఇప్పటివరకూ అంగన్‌వాడీ కేంద్రాల్లో వండి పెట్టేవారు. ఒక్కోసారి కేంద్రానికి వెళ్లే పరిస్థితులు ఉండేవి కావు. ఇంటివద్దకే సరకులు అందజేయాలనే ప్రభుత్వ నిర్ణయంతో బాలింతలు, గర్భిణులకు ఎంతో మేలు జరుగుతుంది.

– కుంచే చినదేవి, బాలింత, చింతలూరు, ప్రత్తిపాడు మండలం

నచ్చిన వంట చేసుకోవచ్చు



ఇప్పటివరకూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని వండి వడ్డించేవారు. ఒక్కోసారి ఆకలి వేయకపోవడం, వేరే ప్రాంతాలకు వెళ్లినప్పుడో భోజనం చేయలేని పరిస్థితి ఉండేది. పౌష్టికాహారం ఇంటికే ఇవ్వడం వల్ల వాటితో నచ్చిన వంట చేసుకోవచ్చు. ప్రభుత్వ ఆలోచన అభినందనీయం.

– షేక్ సైరాభాను, గర్భిణి, శరభవరం, ప్రత్తిపాడు మండలం

అవగాహన కల్పిస్తున్నాం



గర్భిణులు, బాలింతలకు ఈ నెల 15వ తేదీ నుంచి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారుల ఇంటికే పౌష్టికాహారం పంపిణీ చేస్తాం. ప్రతి నెలా రెండు విడతలుగా వీటిని అందజేస్తాం. మొదటి విడతలో సరకులు, రెండో విడతలో పాలు, గుడ్లు పంపిణీ చేస్తాం. సరకులు పంపిణీపై అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్నాం.

– ఆర్‌పీఎస్ లక్ష్మి, సీడీపీఓ, ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు

ఖరీఫ్ పనులు ప్రారంభం



కోటనందూరులో ట్రాక్టర్ దమ్ము చేస్తున్న దృశ్యం

కోటనందూరు: మెట్ట ప్రాంతమైన కోటనందూరు మండలంలో ఖరీఫ్ సాగు పనులు ప్రారంభమయ్యాయి. అల్పపీడన ప్రభావంతో గత నాలుగు రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలకు భూమిలో తేమ, చెరువులు, కాలువల్లో కొంతమేర నీరు చేరడంతో రైతన్నలు ఖరీఫ్ పనులకు శ్రీకారం చుట్టారు. మండలంలో 17 పంచాయతీల పరిధిలో ఈ ఏడాది 10 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తారని అంచనా. బోర్లు, నీటి సదుపాయం ఉన్న రెండు వేల ఎకరాల్లో రైతులు ఇప్పటికే నారుమడులు సిద్ధం చేసి పొలాలను దమ్ము చేస్తున్నారు. తాండవ జలాశయం నిండుకుండలా ఉన్న నేపథ్యంలో మరో ఒకటి రెండు వర్షాలు కురిస్తే సాగు పనులు ఊపందుకునే అవకాశం ఉంది. ఇప్పటికే రైతులు ఆర్బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేశారు.

బాధితుడికి ఆర్థిక సాయం



దుర్గాప్రసాద్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న బీసీ నేత అనూష యాదవ్

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని చింతలూరులో అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థి సర్కారు దుర్గాప్రసాద్‌కు నియోజకవర్గ బీసీ నాయకురాలు దేవర అనూషయాదవ్ ఆర్థిక సాయం అందజేశారు. దుర్గాప్రసాద్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. కాగా ఆదివారం అతనిని అత్యవసర వైద్యం నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న అనూష యాదవ్ దుర్గాప్రసాద్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.7,500 ఆర్థిక సాయం అందజేశారు. ఆపదలో ఉన్న దుర్గాప్రసాద్‌ను దాతలు ఆదుకోవాలని ఆమె కోరారు.

సమస్యలు పరిష్కరిస్తాం



గోకవరం మోడరన్ కాలనీలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న తహసీల్దార్ సుగుణ, వీరబాబు

గోకవరం: గ్రామంలోని ఇందిరా మోడరన్ కాలనీ వాసుల సమస్యలు పరిష్కరిస్తామని వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు అన్నారు. కాలనీలో సమస్యలను ఇటీవల స్థానికులు ఎంపీపీ సుంకర శ్రీవల్లి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో వీరబాబు ఆదివారం తహసీల్దార్ సుగుణతో కలిసి ఇందిరా మోడరన్ కాలనీలో పర్యటించారు. కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైన్లు తదితర సమస్యలను గుర్తించారు. త్వరలో కాలనీ వాసులు సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తాలేటి రమ్యశ్రీ, రాంప్రసాద్, సచివాలయాల కన్వీనర్ వెంకటేష్ పాల్గొన్నారు.

చినుకు.. రాకపోకలకు వణుకు



వి.కొత్తూరులో వర్షాలకు చిత్తడిగా మారిన వసతి గృహాలకు వెళ్లే ప్రధాన రహదారి

తుని రూరల్: వి.కొత్తూరు కోళ్లపారాల కాలనీలోని ఎస్సీ, ఎస్టీ, కేజీబీవీ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారికి నాలుగు వందల మీటర్ల దూరంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాఠశాల, కళాశాల, కస్తూర్బా గాంధీ విద్యాలయం, గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 1000 మందికిపైగా విద్యార్థినులు ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకూ చదువుతున్నారు. ఉపాధ్యాయులతో పాటు సెలవుల్లో ఇళ్లకు వెళ్లొచ్చే విద్యార్థినులు, వసతి గృహాల్లో పిల్లలను చేర్పేందుకు తల్లిదండ్రులు రాకపోకలు సాగిస్తుంటారు. వీరందరికీ ప్రధాన రహదారి ఒక్కటే కావడం, చినుకు పడితే చిత్తడిగా మారడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. కాలనీవాసులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రహదారిని నిర్మించాలని కోరుతున్నారు.

జగనన్న సురక్షతో లబ్ధిదారులకు మేలు



జగపతినగరంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

కిర్లంపూడి: జగనన్న సురక్షతో అర్హులైన లబ్ధిదారులకు ఎంతో మేలు జరుగుతుందని జగపతినగరం సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత అన్నారు. జగపతినగరంలో ఆదివారం తహసీల్దార్ కేవీవీ మాధవరావు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజల సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. జగనన్న సురక్షను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, ఎంపీటీసీ కాళ్ల దొంగబాబు, కురుమళ్ల చిన్ని, ఈఓపీఆర్డీ రామిశెట్టి వీర్రాజు, గుడాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సత్రం భూములకు కౌలు వేలం నిర్వహించాలి



రంప యర్రంపాలెంలో ర్యాలీ చేస్తున్న రైతు కూలీలు

గోకవరం: రంపయర్రంపాలెంలో సుందరమ్మ సత్రానికి చెందిన 15.5 ఎకరాల మిగులు భూమికి బహిరంగ వేలం నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో రంపయర్రంపాలెంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ సుందరమ్మ సత్రం భూములకు రైతు కూలీ సంఘం పోరాట ఫలితంగా గతంలో బహిరంగ వేలం నిర్వహించారన్నారు. మరో 15.5 ఎకరాల భూమి భూస్వాముల చేతుల్లో ఉందని, ఆ భూమికి కూడా వేలం పాట నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే గోకవరం మండలంలో సుమారు 300 ఎకరాలు సీలింగ్ భూమి ఉందన్నారు. దానిపై సమగ్ర విచారణ చేపట్టి నిరుపేదలకు పంచిపెట్టాలన్నారు. కార్యక్రమంలో కె.సతీష్, సంఘ జిల్లా కన్వీనర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

శంఖవరం: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సీడీపీఓ పద్మావతి ఆదివారం తెలిపారు. ప్రాజెక్ట్ పరిధిలో మూడు అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పదో తరగతి పాసైన 21 నుంచి 35 సంవత్సరాల లోపు స్థానిక మహిళలు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 17వ తేదీ లోగా సీడీపీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఖాళీల వివరాలు ఇలా...

హెల్పర్ పోస్టులు..

శంఖవరం మండలం వి.వెంకటాపురం (ఓసీ), జి.కొత్తపల్లి-2 (ఓసీ హెచ్‌హెచ్), రౌతులపూడి మండలం పి.చామవరం (ఎస్సీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆమె వివరించారు.

ప్రత్తిపాడు: మండలంలోని పెదశంకర్లపూడిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ హెల్పర్ పోస్టు భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్టు ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఆర్‌పీఎస్ లక్ష్మి తెలిపారు. 21 నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు కలిగిన బీసీ -ఎ కులానికి చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. దరఖాస్తుతో పాటు విద్యార్హత, కులం, వయస్సు, స్థానికత, ఆధార్ కార్డుల జెరాక్స్‌లపై గెజిటెడ్ అధికారి సంతకం ఉండాలన్నారు. అభ్యర్థులు నేరుగా తమ దరఖాస్తులను ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేసి రసీదు పొందాలని సూచించారు.

కిర్లంపూడి: మండల పరిధిలో ఖాళీగా అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ ఎం.పూర్ణిమ ఆదివారం తెలిపారు. మండలంలోని వీరవరం–3, సోమరాయణంపేట-2లో రెండు అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పదో తరగతి పాసై ఈ నెల 1వ తేదీ నాటికి 21 నుంచి 35 ఏళ్ల లోపు ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 17వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు జగ్గంపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని సూచించారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

బోట్‌క్లబ్: ప్రతిభగల బ్రాహ్మణ బాలబాలికలకు ప్రోత్సాహకాలు అందివ్వనున్నట్లు నగర బ్రాహ్మణ సేవా సంఘం కార్యదర్శి ముంజులూరి విశ్వేశ్వర రావు తెలిపారు. రామారావుపేటలోని బ్రాహ్మణ సేవా సంఘం కార్యాలయంలో ఆదివారం సంఘ సమావేశం నిర్వహించారు. ఇటీవల విడుదలైన 10వ తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు వచ్చిన బ్రాహ్మణ బాలబాలికలకు నగదు బహుమతితో పాటు , సంఘం తరఫున ప్రశంసాపత్రం ఇవ్వనున్నట్లు చెప్పారు.

ఉత్సాహంగా స్కేటింగ్ పోటీలు



తునిలో స్కేటింగ్ పోటీల విజేతలకు మెడల్స్ అందజేస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి

తుని: చిన్నారుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు నిర్వహించిన రోలర్ స్కేటింగ్ పోటీలకు అనూహ్య స్పందన రావడం ఆనందంగా ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. ఆదివారం పురపాలకసంఘం ఆధ్వర్యంలో స్కేటింగ్ పోటీలు నిర్వహించారు. స్థానిక రాజా రాజబాబు మున్సిపల్ పార్కులోని స్కేటింగ్ ట్రాక్‌లో రాత్రి జరిగిన ఫైనల్స్‌లో ప్రతిభ చూపిన చిన్నారులకు చైర్‌పర్సన్ సుధారాణి మెడల్స్ అందజేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు స్కేటింగ్ నేర్పించాలన్నారు. భవిష్యత్‌లో జిల్లా స్థాయి పోటీలను తునిలో నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, తుని పట్టణశాఖ పార్టీ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా తదితరులు పాల్గొన్నారు.

కర్షకా.. మేలుకో

- ఖరీఫ్ రైతులకు నకిలీ విత్తనాల బెడద
- ఆఫర్లతో ఎర వేస్తున్న కంపెనీలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు
- నియోజకవర్గంలో 12,087 హెక్టార్లలో సాగు

కొత్తపల్లి: నియోజకవర్గంలో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే వేసవి దుక్కులు పూర్తి చేసిన రైతులు ఇటీవల కురిసిన వర్షాలకు వ్యవసాయ పనులు ప్రారంభించారు. పలు గ్రామాల్లో రైతులు నారుమడులు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం రైతులు విత్తనాలు, ఎరువులు సమకూర్చుకుంటున్నారు. ఈ సమయంలో పలురకాల కంపెనీల విత్తనాలు, పురుగు మందుల ప్రచారం జోరందుకుంది. ఈ క్రమంలో నాణ్యమైన విత్తనాల కోసం రైతులు ఆరా తీస్తున్నారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ కంపెనీలు ఆకర్షణీయమైన ప్రకటనలు, ప్రచార ఆర్భాటాలతో రైతులను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నాయి. కాగా రైతులు విత్తనాల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలని, లైసెన్స్‌డ్ విత్తనాలనే కొనుగోలు చేయాలని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. ముఖ్యంగా రైతులే సొంతంగా విత్తనాలను తయారు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

డీలర్లకు ఆఫర్లు

విత్తన కంపెనీల యాజమాన్యాలు జిల్లాలోని డీలర్లకు రకరకాల ప్యాకేజీలు, విదేశీ టూర్లు, ఆఫర్ చేస్తుండడంతో వారు రైతులకు ఎక్కువ మోతాదులో నదురు కంపెనీల విత్తనాలను కట్టబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో నకిలీ, నాసిరకం విత్తనాలు మార్కెట్‌కు వస్తున్నారు. రైతులు ఈ కంపెనీల వలలో పడి నకిలీ విత్తనాలు కొనుగోలు చేయడం ఆ తర్వాత మోసపోవడం షరామామూలైంది.

నియోజకవర్గంలో ఇలా..

పిఠాపురం నియోజకవర్గంలో ఈ ఏడాది 12,087 హెక్టార్లలో రైతులు వరిసాగు చేస్తున్నారు. కొత్తపల్లి మండలంలో 6167 మంది రైతులు 10264 ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేస్తారని వ్యవసాయాధికారులు అంచన వేస్తున్నారు.



గోర్సలో విత్తనశుద్ధి చేస్తున్న రైతులు

మోతాదుకు మించితే ముప్పు

రైతులు అధిక దిగుబడులు సాధించాలనే ఉద్దేశంతో విత్తనాలతో పాటు ఎరువులు మోతాదుకు మించి వినియోగిస్తుంటారు. ఇలా చేయడం వల్ల తీవ్ర నష్టాలను చవిచూడాల్సి వస్తుంది. పురుగు మందుల విషయంలోనూ మోతాదుకు మించి వినియోగించవద్దని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. భూమిలో పోషకాల విలువల ఆధారంగా ఎరువులు, పురుగు మందులు వాడాలని సూచిస్తున్నారు. గ్రామాల్లో ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే తమకు ఫిర్యాదు చేయాలని వ్యవసాయశాఖ అధికారులు కోరారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే రైతుల విత్తనాలు కొనుగోలు చేయాలి. విత్తనాలు కొనుగోలు చేస్తే రసీదు తప్పకుండా తీసుకోవాలి. రైతులకు పంటల బీమా రావాలంటే విత్తనాలు కొనుగోలు చేసిన రసీదు తప్పనిసరి. ఫెర్టిలైజర్ షాపుల్లో డీలర్లు ఎరువులు, విత్తనాల వివరాలు రిజిస్టర్లలో నమోదు చేయాలి. రైతులు నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి. వ్యవసాయ అధికారులు సలహాలు, సూచనలు పాటించాలి. ముఖ్యంగా కొనుగోలు చేసిన విత్తనాలలో 100 గింజలు తీసుకుని మొలక శాతాన్ని పరీక్షించుకోవాలి. సుమారు 80 శాతానికి పైగా మొలకెత్తిన విత్తనాలను మాత్రమే ఉపయోగించుకోవాలి. విత్తనశుద్ధి తప్పని సరిగా చేయాలి.

– వి.జోగిరాజు, మండల వ్యవసాయాధికారి, కొత్తపల్లి

జంక్షన్ .. టెన్షన్



హైవేపై ప్రమాదకరంగా ఉన్న చిన్నింపేట జంక్షన్

- ప్రమాదాలకు నిలయంగా చిన్నింపేట కూడలి
- బస్టాండ్ నిర్మించాలని కోరుతున్న ప్రజలు

ఏలేశ్వరం: పదహారో నంబర్ జాతీయ రహదారిపై మండల పరిధిలోని చిన్నింపేట జంక్షన్ ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ జంక్షన్ మీదుగా నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సిరిపురం నుంచి వచ్చే వాహనాలు మలుపు తిరిగే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ సెంటర్‌లో బస్టాండ్ నిర్మించాలని గ్రామస్తులు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. దీనిపై పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు సమర్పించినా ఫలితం లేదు. ప్రమాదాల సమయంలో ఈ ప్రాంతంలో వీధి దీపాలు ఏర్పాటుతో పాటు సెక్యూరిటీ గార్డును నియమిస్తామని ప్రకటిస్తున్న అధికారులు తరువాత పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు బోర్డులు ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారనే వాదనలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ ప్రాతంలో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడంతో పాటు బస్టాండ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.